


## హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్లకు గడువు పెంపు

**బెంగళూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి):** వాహనాలకు హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ (హెచ్ఎస్ఆర్‌పీ) ప్లేట్లను అమర్చుకోవడానికి నవంబరు 20వరకు గడువును పొడిగించారు. హెచ్ఎస్ఆర్‌పీ ప్లేట్ల ఏర్పాటు దాదాపు ఏడాది కాలంగా వాయిదా పడుతూ వస్తోంది. తాజాగా గడువు ముగిసిపోవడంతో పోలీసులు కేసు నమోదు, జరిమానా వసూళ్లు ఉంటుందని భావించారు. అయితే హైకోర్టులో దాఖలైన పిటిషన్‌పై విచారణను నవంబరు 20కి వాయిదా వేశారు. దీంతో మరో రెండు నెలలపాటు రాష్ట్రవ్యాప్తంగా హై సెక్యూరిటీ ప్లేట్లు లేకుండానే తిరిగేందుకు వాహనదారులకు అవకాశం కల్పించినట్లయ్యింది.



# అనుసంధానం ఎప్పుడో..?



- కలగానే కళసా-బండూరి కాలువల అనుసంధానం
- నిపుణులు అనుమతిచ్చినా పట్టించుకోని ప్రాధికార
- పులుల సంరక్షణ పేరుతో స్పందించని ఎన్‌టీసీఏ
- రైతులకు తప్పని ఎదురుచూపు
- అనుమతులపై స్పందించాలని ప్రధానికి సీఎం లేఖ

**బెంగళూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి):** మహదాయి నది రాష్ట్రంలోని భీమఘడ్ వన్యప్రాణుల అభయారణ్యంలో జన్మించినా దానిని అనుభవించలేని దుస్థితి నెలకొంది. గోవాకు నీరు తరలిపోయి అరేబియా సముద్రంలో కలుస్తున్నా నీటిని సద్వినియోగం చేసుకోలేని పరిస్థితి వాటిల్లింది. మహదాయికి అనుబంధమైన కళసా-బండూరి కాలువల అనుసంధానం కోసం దశాబ్దాలుగా పోరాటం సాగుతున్నా ఫలితం తేలకుండా పోయింది. నిపుణులు అంగీకరించినా ప్రాధికార జాప్యం చేస్తుండడంతో కళసా-బండూరి ప్రాజెక్టు ముందుకు కదలడం లేదు. జాతీయ పులుల సంరక్షణ ప్రాధికార (ఎన్‌టీసీఏ) కళసా-బండూరి కాలువల అనుసంధానం ప్రాజెక్టు అమలుకు నిపుణుల బృందం సిఫారసు చేసింది. అయితే ఎన్‌టీసీఏ మాత్రం తన నిర్ణయాన్ని ప్రకటించలేదు. దీంతో మహదాయి పథకం అమలుకు వెనుకడుగు పడుతోంది. ప్రాజెక్టు సాధకబాధకాలపై సమగ్రంగా పరిశీలించి నివేదిక ఇవ్వాలని ప్రాధికార నలుగురు నిపుణులతో 2023 డిసెంబర్‌లో కమిటీ ఏర్పాటు చేసింది. ఈ ఏడాది జనవరిలో ప్రాజెక్టు ప్రదేశాన్ని నిపుణుల బృందం సందర్శించింది. జలవనరులు, అటవీశాఖ అధికారులతో కలసి సమీక్ష జరిపి ప్రాధికారకు జూన్ 23న 8 పేజీలతో ఓ నివేదికను ప్రాధికారకు సమర్పించారు. ప్రాజెక్టుకు సంబంధించి భారీ ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుని వేసవిలో వన్యజీవులకు తాగునీటి లభ్యత, భూగర్భజలం పెంపు సమకూర్చాల్సి ఉంటుందని ప్రస్తావించారు. 1972 సెక్షన్ 380 (1)(జీ) ప్రకారం ప్రాజెక్టు అమలుకు సిఫారసు చేసినట్లు నివేదికలో స్పష్టం చేశారు. వన్యజీవుల సంరక్షణ కేంద్రంనుంచే ఈ ప్రాజెక్టు అమలవుతున్నందున గోవా ప్రభుత్వం అభ్యంతరం తెలిపిన మేరకు ఎన్‌టీసీఏ అనుమతులు పొందాల్సి వచ్చింది. ఇందుకోసం ఎన్‌టీసీఏ కర్ణాటక ప్రభుత్వానికి ప్రస్తావనలు పంపింది. ప్రాజెక్టుకు 26.92 హెక్టార్ల అటవీభూమిని వినియోగించుకోవాల్సి ఉంటుంది. ప్రాజెక్టుకోసం ఖాళీ పులుల కారిడార్, సహ్యాద్రి పులుల సంరక్షణా ప్రదేశం 7.96 హెక్టార్లు అటవీ భూములలో 2.71 హెక్టార్లలో వినియోగించుకోవాలని ఉద్దేశించారు. రాష్ట్ర ప్రభుత్వానికి పంపిన ప్రస్తావనలో ఈ అంశాన్ని స్పష్టం చేశారు.

### పులుల సంరక్షణ పేరుతో
## ఎన్‌టీసీఏ వాయిదాలు



మహదాయి పరీవాహక ప్రాంతం

ప్రాజెక్టుకు సంబంధించి వన్యజీవి మండలి, పులుల సంరక్షణా ప్రాధికార అభిప్రాయాన్ని కోరింది. నిపుణుల కమిటీ నివేదిక సమర్పించాక జాతీయ వన్యజీవిమండలి మూడుసభలు నిర్వహించింది. ప్రాధికార అభిప్రాయం వ్యక్తం చేయలేదనే కారణంతో వాయిదా వేసింది. జనవరి 30న మండలి తొలిసభ జరిగింది. మహదాయి విషయమై చర్చ జరిగింది. ఈ అంశం న్యాయప్రక్రియలో ఉందని, జోక్యం చేసుకోవడం ఉల్లంఘన అవుతుందని ఎన్‌టీసీఏ అధికారులు ప్రకటించారు. ప్రాధికార ప్రాజెక్టుకు సంబంధించి ఎటువంటి అభిప్రాయం చెప్పలేదు. 1972లో వన్యజీవి సంరక్షణా చట్టం సెక్షన్ 38 ప్రకారం ప్రాధికారనుంచి అభిప్రాయం పొందాలని మండలి నిర్ణయించింది. యక్షన్‌ప్లాన్ కోసం సభ వాయిదా వేశారు. ఫిబ్రవరి 22న రెండో సభ జరగ్గా ఈ అంశం ప్రస్తావనకు రాలేదు. జూలై 31న మూడో సభ జరిగింది. ఈ అంశం ప్రస్తావనకు వచ్చింది. మహదాయి ప్రాజెక్టు ప్రదేశం వాస్తవ అధ్యయనం కోసం ప్రాధికార నిపుణుల కమిటీని పంపిందని కమిటీ పలు సిఫారసు చేసిందని వీటికి సంబంధించి ప్రాధికార కొన్ని అంశాలను లేవనెత్తిందని, వాటికి సమగ్రత రాలేదని తేల్చింది. కోర్టులో ఉన్నందున జోక్యం చేసుకుంటే ఉల్లంఘన అవుతుందని తొలి సమావేశంలో ప్రస్తావించిన అంశాన్ని మూడోసభలో పేర్కొంది. వన్యజీవి మండలి నుంచి అనుమతులు లభించలేదు.



## నిపుణుల సిఫారసులివీ..

కళసా-బండూరి ప్రాజెక్టుపై జాతీయ పులుల సంరక్షణా ప్రాధికార ఏర్పాటు చేసిన కమిటీలో ఎన్‌టీసీఏ జనరల్ మేనేజర్ హరిణి వేణుగోపాల్, ఎన్‌టీసీఏ శాస్త్రవేత్త డాక్టర్ కౌశిక్ బెనర్జీ, రాష్ట్ర జలవనరుల విభాగం ప్రతినిధి విజయ కుమార్ గోగి, బెళగావి జిల్లా చీఫ్ ఫారెస్ట్ కన్సర్వేటర్ మంజునాథ్ చవాన్‌లు ఉన్నారు. వీరు చేసిన సిఫారసులలో అటవీప్రాంతంలో తవ్వకాలు మాత్రం భూమిలోపల ఉండాలని, నిర్మాణపు అవశేషాలు అటవీప్రాంతంలో పైభాగంలో ఉండాలని పేర్కొన్నారు.

- నిర్మాణాలు సూర్యోదయం తర్వాత, సూర్యాస్తమయం లోగా అమలు చేయాలని అటవీప్రాంతంలో కార్మికుల శిబిరాలు ఏర్పాటు చేయరాదని, నిర్మాణస్థలం మినహాయించి అడవుల్లో కార్మికులు సంచరించరాదని సూచించింది.
- అడవిలో జంతువులకు ఇబ్బంది కలగకుండా కాలువల మార్గంలో కందకాలను తవ్వాలని వాటిని, ఆ తర్వాత వాటిని మూసివేయాలని సూచించింది.
- వాయుకాలుష్యం తక్కువ ఉండాలని, పులుల కారిడార్ ప్రదేశంలో పేలుళ్లు, భారీ యంత్రాలను ఉపయోగించరాదని సూచించింది. భవిష్యత్తులో అంతర్భాగంలో ఉండే కాలువల నిర్వహణ, పర్యవేక్షణకు అటవీశాఖ అనుమతులు తప్పనిసరి ఉండాలి.
- ప్రస్తుతం వన్యజీవి సంరక్షణ ప్రాజెక్టులో భాగంగా భీమగడ వన్యజీవిధామ, పక్కన ఉండే అటవీప్రాంతాలను అభివృద్ధి చేయాలి.
- వన్యజీవి ప్రదేశాన్ని భీమగడ సంరక్షణా కేంద్రానికి ఏ సమయంలోనైనా చేర్చవచ్చు. జనవసతి ఉండే ప్రదేశాలను చేర్చడం ద్వారా పల్లెల్లో ప్రజల పునరావాస సౌలభ్యాలను కల్పించడంతోపాటు అటవీప్రాణులకు ఎక్కువ ఇబ్బంది కలిగించకుండా పర్యవేక్షించాలి.
- కళసా, హల్తారా, సుర్లా నదులు వేసవిలో ఎండిపోతాయి. దీంతో వన్యప్రాణులకు తాగునీరు లభించదు. ప్రాజెక్టు అమలు చేయడం ద్వారా 13.20 హెక్టార్ల ప్రదేశం ముంపునకు గురికానుంది.
- చిన్నప్రాజెక్టులలో సేకరించే నీటిని ఏటా 5 నెలల వరకు జూన్ నుంచి అక్టోబరు వరకు ఉపయోగిస్తారు. తద్వారా దిగువప్రదేశంలో ప్రవాహం అరికట్టడం మహదాయి ట్రిబ్యునల్ రాష్ట్రానికి కేటాయించినంత నీరు మాత్రమే వినియోగించాలి. జలాశయాలలో నీరు వేసవిలో వన్యప్రాణులకు లభ్యంగా ఉండాలి. కాలువలు, ప్రవాహ మార్గాలు నేలకిందిభాగంలో ఉండడం ద్వారా వన్యప్రాణులకు ఎక్కువగా ఇబ్బంది ఉండదు.
- భీమగడ వన్యజీవి ధామనుంచి 5.6 కిలోమీటర్ల దూరంలో ప్రాజెక్టు ఉన్నందున పులులు, ఏనుగులు అప్పుడప్పుడు సంచారం చేయవచ్చు. కళసా కాలువ మలుపు ప్రాజెక్టు సమాంతరంగా వెళ్లే జాతీయ రహదారికి రెండు భాగాలలో ఈ ప్రాజెక్టు ఉన్నందున ముంపునకు గుర య్యే అవకాశం ఉంటుం ది. తద్వారా రెండు బ్రిడ్జిలను నిర్మించాలి. అటవీశాఖ రూపొందించిన వన్యజీవిసంరక్షణ ప్రాజె క్టు సమగ్రంగా ఉంది.

### అనుమతులు ఇప్పించండి : ప్రధానికి సీఎం లేఖ

ఉత్తర కర్ణాటక ప్రాంత ప్రజలకు జీవనాడిగా ఉండే కళసా-బండూరి కాలువల అనుసంధానం ప్రాజెక్టుకు వెంటనే అనుమతులు ఇప్పించాలని సీఎం సిద్దరామయ్య ప్రధానమంత్రి నరేంద్రమోదీకి లేఖ రాశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పుట్టినరోజును పురస్కరించుకుని సీఎం శుభాకాంక్షలు తెలిపారు. ప్రధానికి పంపిన లేఖలో మీకు భగవంతుడు మంచి ఆరోగ్యం, సంతోషం ఇవ్వాలని కర్ణాటక రాష్ట్రానికి సంబంధించి కీలకమైన విషయాలలో మీ దృష్టికి తీసుకొస్తున్నానని ప్రస్తావించారు. ఉత్తర కర్ణాటక ప్రాంత ప్రజలకు తాగునీటిని సమకూర్చే కళసా-బండూరి ప్రాజెక్టుకు అటవీ, పర్యావరణ మంత్రిత్వశాఖ, వన్యజీవి ప్రాధికారల వద్ద సమస్య పెండింగ్‌లో ఉందన్నారు. మహదాయి ట్రిబ్యునల్ 2018 ఆగస్టు 14న ప్రకటించిందని 2020 ఫిబ్రవరి 27న గెజిట్‌లోనూ ప్రకటించారన్నారు. కళసా కాలువకు 1.72 టీఎంసీలు, బండూరి కాలువ నుంచి 2.18 టీఎంసీలు వినియోగించేలా ప్రతిపాదనలు జరిగాయన్నారు. మీరు ఛైర్మన్‌గా కొనసాగే జాతీయ వన్యజీవి మండలి అనుమతులు ఇవ్వలేదని, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని కోరారు.



### ఇంటెలిజెన్స్
# వైఫల్యం..!

- డిసెంబరులోనే సీఎంపై గవర్నర్‌కు ఫిర్యాదు
- ఎనిమిది నెలలైనా సమాచారం ఇవ్వలేదు..
- అధికారుల నిర్లక్ష్యంపై అధిష్ఠానం ఆగ్రహం

**బెంగళూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి):** మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార (ముడా)తోపాటు పలు విషయాలకు సంబంధించి ముఖ్యమంత్రి సిద్దరామయ్యపై గత ఏడాది డిసెంబరులోనే రాజ్‌భవన్‌కు ఫిర్యాదు అందింది. అయితే ఈ విషయాన్ని గుర్తించడంలో ఇంటెలిజెన్స్ పూర్తిగా విఫలమైనట్లు తెలుస్తోంది. సీఎం సిద్దరామయ్యపై ప్రాసిక్యూషన్ నిర్ణయంతోపాటు రాష్ట్రంలో 8నెలల క్రిందటే ప్రస్తావన వచ్చినట్లు తెలుస్తోంది. ఇంటెలిజెన్స్ విభాగం విఫలం కావడంపై కాంగ్రెస్ అధిష్ఠానం విచారం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఇటీవలే ఇంటెలిజెన్స్ ముఖ్య అధికారిని మార్పు చేశారు. అయితే ఇంటెలిజెన్స్ విభాగం ఎందుకు ప్రభుత్వానికి సమగ్రమైన వివరాలు అందించలేదనే ఆరోపణలు సాగుతున్నాయి. సీఎం విషయంలోనే ఇంటెలిజెన్స్ నిర్లక్ష్యం చేసిందా అనే అంశంపై రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలో తీవ్ర చర్చ సాగుతోంది. సిద్దరామయ్యపై డిసెంబరులోనే తొలి ఫిర్యాదు రాజ్‌భవన్‌కు చేరినా కనీస సమాచారం కూడా ఇంటెలిజెన్స్ గుర్తించలేకపోయింది. సామాజిక కార్యకర్తలు టీజే అబ్రహాం, స్నేహమయి కృష్ణలు ఫిర్యాదు చేసేందుకు ముందే ప్రదీప్‌కుమార్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశాడు. తాజాగా అబ్రహాం, స్నేహమయిల ఫిర్యాదుకు అనుగుణంగా రాజ్‌భవన్ నుంచి ప్రాసిక్యూషన్‌కు అనుమతులు వెలువడ్డాయి. సీఎంఒకు చెందిన ఓ సీనియర్ అధికారి గతంలోనే ఈ అంశాన్ని ప్రస్తావించినా ఇంటెలిజెన్స్ పట్టించుకోకపోవడంతో అటువంటిది ఉండదని నిర్లక్ష్యం చేసినట్లు తెలుస్తోంది. ముడా అంశం తీవ్రస్థాయిలో సాగుతున్న వేళ గవర్నర్ ఢిల్లీ వెళ్లారు. అధికారిక పర్యటనకు ఢిల్లీ వెళ్లినా న్యాయపరమైన అంశాలపై నిపుణులతో చర్చించారని కేంద్రమంత్రులతోనూ ఈ అంశంపై ప్రస్తావించిన అంశం ఇటీవల వెలుగులోకి వచ్చింది. రాష్ట్రంలో ప్రతి చిన్న కదలికపైనా సమాచారం సేకరించాల్సిన ఇంటెలిజెన్స్ విభాగం ఎందుకు వైఫల్యం చెందిందనే అంశంపై మంత్రులు ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది.


జైలులోకి వెళ్తున్న తల్లి మీనా, అక్క, బావ తదితరులు


## తల్లిని చూసి భావోద్వేగం

- నటుడు దర్శన్‌ను చూసేందుకు తొలిసారి బళ్లారి జైలుకు అమ్మ మీనా
- జైలు గదిలో టీవీ సౌకర్యానికి అనుమతి

**బళ్లారి సిటీ, సెప్టెంబరు 19:** చాలా రోజుల తర్వాత అమ్మను చూసిన నటుడు దర్శన్ భావోద్వేగానికి గురయ్యారు. బళ్లారి జైలుకు వచ్చిన తరువాత నటుడు దర్శన్‌ను చూసేందుకు తొలిసారి గురువారం తల్లి, అక్క, బావ వచ్చారు. ఇప్పటి వరకు ఆయన భార్య విజయలక్ష్మి నాలుగు సార్లు ఆయనను చూసేందుకు రాగా నటుడు ధన్వీర్, సన్నిహితుడు హేమంత్ కూడా ఆయనను పరామర్శించారు. తొలిసారి అమ్మ, అక్క, బావ రావడంతో ఆనందంతో పాటు ఆవేదన పడినట్లు తెలిసింది. అనంతరం ఒకరి ఆరోగ్యం గురించి మరొకరు అడిగి తెలుసుకున్నారు. నిత్యం జైల్లో తల్లిని తలచుకునే దర్శన్ తపించేవాడు. దర్శన్ అమ్మ బేకరీ ఫుడ్, పండ్లను దర్శన్‌కు అందజేశారు. చాలా రోజుల డిమాండ్ తరువాత దర్శన్ ఉంటున్న సెల్‌కు జైలు అధికారులు టీవీ సౌకర్యం కల్పించారు. అయితే దూరదర్శన్ చానల్‌ని మాత్రమే చూసేందుకు అనుమతించారు. మరోవైపు నటుడి నుంచి ఇతర సౌకర్యాల కోసం డిమాండ్ పెరిగింది. మృదువైన తలదిండు, కుర్చీ ఇవ్వాల్సిందిగా అధికారులను కోరారు. దర్శన్ ఇప్పటికే మూడు వారాలుగా జైల్లో ఉన్నారు. బళ్లారి జైలుకు వీఐపీల తాకిడి పెరిగిందని చెప్పవచ్చు.




# అతిథి అధ్యాపకుల్లో ఆందోళన



- యూజీసీ నిబంధనలతో అయోమయం
- ఉద్యోగ భద్రతపై అనుమానాలు
- తాత్కాలిక మెరిట్ ప్రకటన
- కౌన్సెలింగ్‌పై గందరగోళం

**బెంగళూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి):** అతిథి అధ్యాపకులు అభద్రతా భావంతో తల్లడిల్లుతున్నారు. రాష్ట్రంలోని 430 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో సేవలందిస్తున్న 10,600మంది అతిథి అధ్యాపకుల ఉద్యోగం కొనసాగుతుందో లేదో అన్న ఆందోళన ఉంది. విధి నిర్వహణలో ఒత్తిడి, యూజీసీ ప్రమాణాల డెడ్‌లైన్ వంటివి కారణాలుగా ఉన్నాయి. 1243 మంది అధ్యాపకుల నియామకం, కొందరు బదిలీలతో అతిథి ఉపాధ్యాయుల భవిష్యత్తు ఏం కానుందో అనే ఆవేదనలో ఉన్నారు. యూనివర్సిటీల గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) విధించిన అర్హత లేని అతిథి అధ్యాపకులు విధులు కోల్పోయే పరిస్థితిలో ఉన్నారు. ఉన్నత విద్యాసంస్థల్లో లెక్చరర్‌లుగా పనిచేసేవారు యూజీసీ నిబంధనలకు అనుగుణంగా పీజీతోపాటు నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ (ఎన్ఈటీ), కేసెట్, సహాయ ప్రాధ్యాపకుల అర్హతా పరీక్షలు లేదా పీహెచ్‌డీ డిగ్రీ పొంది ఉండాల్సి ఉంటుంది. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో సేవలందించే 10,600మంది గెస్ట్ లెక్చరర్లలో 55శాతం మందికి యూజీసీ అర్హతలు లేవు. ఇందుకోసమే 2025 జనవరి 13వరకు కళాశాల విద్యావిభాగం గడువు ఇచ్చింది. నిబంధనల ప్రకారం 5085 అతిథి అధ్యాపకులు విధులకు దూరమయ్యే భయంలో ఉన్నారు. ఇటీవల జరిగిన కేసెట్ పరీక్షల్లో లక్షమంది పాల్గొనగా కేవలం 6వేలమంది ఉత్తీర్ణులయ్యారు.




## నిబంధనల మార్పులతో ఇబ్బందులు

- రాష్ట్రప్రభుత్వం జాతీయ విద్యావిధానం (ఎన్ఈపీ)కి బదులు రాష్ట్ర విద్యా విధానం (ఎస్ఈపీ) అమలులోకి తీసుకురావడంతో పనిభారం కొంత తగ్గినట్లయ్యింది.
- గత ఏడాది ఒక సబ్జెక్టుకు 6 గంటలు పని ఉండేది అయితే ప్రస్తుతం 4-5 గంటలకు తగ్గినట్లయ్యింది. కళాశాలలో ఒక సబ్జెక్టుకు ఒకరికి బదులుగా ఇద్దరు అధ్యాపకులు ఉంటారు. ఇలా ఒకరికి అవకాశం లభిస్తే మరొకరు విధులనుంచి దూరం కావాల్సి ఉంటుంది.
- కళాశాల విద్యావిభాగం ఫస్ట్‌గ్రేడ్ కళాశాలకు తాత్కాలిక మెరిట్‌జాబితాను ప్రకటించారు. సుమారు 34,434 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 8900 మంది అభ్యర్థులు రెన్యూవల్ విధానంతో కొనసాగదలిచారు. అతిథి ఉపన్యాసకులందరినీ కొనసాగించాలనే డిమాండ్ ఉంది. కొందరు రాష్ట్రస్థాయిలో కౌన్సెలింగ్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఉన్నతవిద్యాశాఖ ఎటువంటి నిర్ణయం తీసుకుంటారనేది స్పష్టం చేయలేదు.
- ప్రస్తుతం అమలు చేస్తున్న తరహాలోనే కొనసాగిస్తుందా లేదా రాష్ట్రస్థాయి కౌన్సెలింగ్‌కు వెళ్తుందా అనేది ఖరారు కాలేదు. 1243మంది అధ్యాపకులను నియమిస్తూ గెజిట్ జారీ చేశారు. వీరికి పోస్టింగ్‌లు ఖరారు చేస్తే 1500మంది అధ్యాపకులను రిలీవ్ చేయాల్సి ఉంటుంది. మరోవైపు ప్రభుత్వం బదిలీలకు ఆదేశాలు జారీ చేసింది. ఈ కారణంతో కోరుకున్న చోట లేదా గతంలో పనిచేసిన కళాశాలలోనే అవకాశం లభిస్తుదా అనేది దరఖాస్తుదారులలో ఆందోళన కొనసాగుతోంది.
- రాష్ట్ర ప్రభుత్వం డిగ్రీ కళాశాలల్లోనే 58చోట్ల పీజీ కేంద్రాలు కొనసాగిస్తోంది. ఇందులో పనిచేసే 116మంది అతిథి అధ్యాపకుల్లో ఆందోళన మొదలయ్యింది. డిగ్రీ కళాశాలలే పీజీ కేంద్రాలుగా మారిపోయాయి. పీజీ కేంద్రాలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని యువత డిమాండ్ చేస్తోంది. ఇదే విషయమై ఉన్నత విద్యాశాఖ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్ అభిప్రాయం మేరకు ఫస్ట్‌గ్రేడ్ కళాశాలల్లో సేవలందిస్తున్న అతిథి అధ్యాపకులు వారు పనిచేసే కళాశాలల్లోనే కొనసాగించే అవకాశం ఉంటుందన్నారు. అతిథి అధ్యాపకులను మినహాయించి మిగిలిన పోస్టులకోసం రాష్ట్రస్థాయిలో కౌన్సెలింగ్ ఇస్తామన్నారు. అయితే కౌన్సెలింగ్ పూర్తయ్యే వరకు అతిథి లెక్చరర్లకు ఆందోళన తప్పేలా లేదు.

### దక్షిణకన్నడ ఎమ్మెల్సీ ఎన్నికకు
## షెడ్యూల్ విడుదల

**బెంగళూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి):** దక్షిణకన్నడ పరిధిలోని స్థానిక సంస్థల కోటాలో ఎన్నికైన కోట శ్రీనివాసపూజారి రాజీనామాతో ఖాళీ అయిన స్థానానికి ఎన్నికల షెడ్యూల్ విడుదల చేశారు. ఇటీవల ఉడుపి ఎంపీగా ఎన్నికైన ఆయన తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ అధికారి గురువారం షెడ్యూల్ ప్రకటించారు. కేంద్ర ఎన్నికల కమిషన్ సూచనలకు అనుగుణంగా షెడ్యూల్ ఖరారైంది. కోట శ్రీనివాస పూజారి ఈ ఏడాది జూన్ 15న ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. 2028 జనవరి దాకా పదవీకాలం ఉండనుంది. ఈనెల 26నుంచి నామినేషన్ల స్వీకరణ ఆరంభం కానుంది. అక్టోబరు 3తో నామినేషన్ల గడువు ముగియనుండగా, 4న పరిశీలనలు, 7న ఉపసంహరణకు అవకాశం ఉంది. అక్టోబరు 21న పోలింగ్ జరగనుంది. 24న ఓట్ల లెక్కింపు కొనసాగనుంది. 416 స్థానిక సంస్థలనుంచి 6,454మంది ఓటర్లు ఉండగా ప్రస్తుతం సక్రియంగా ఉన్న సంస్థలు 392 కాగా 6033 మంది ఓటర్లు ఉన్నారు.



## తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

| | ప్రస్తుతం | గత ఏడాది |
|---|---|---|
| నీటి మట్టం (అడుగులు) | 1632.00 | 1,621.74 |
| ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు) | 23,314 | 1778 |
| ఔట్ ఫ్లో (క్యూసెక్కులు) | 21,358 | 9,924 |
| సామర్థ్యం (టీఎంసీలు) | 101.77 | 66.34 |

## డీఆర్‌ఎంతో రాయచూరు ఎమ్మెల్యే భేటీ



డీఆర్ఎంను కలిసి ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్

**గుంతకల్లు, సెప్టెంబరు 19:** కర్ణాటకలోని రాయచూరు రైల్వేస్టేషన్‌లో సమస్యలు, ఇతర విషయాలు చర్చించేందుకుగాను అక్కడి ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్ గురువారం గుంతకల్లుకు వచ్చి డివిజనల్ రైల్వే మేనేజర్ విజయకుమార్‌తో భేటీ అయ్యారు. పట్టణంలోని డీఆర్ఎం కార్యాలయంలో గురువారం ఉదయం ఆయన డీఆర్ఎంను కలిసి సమస్యల పరిష్కారాలపై చర్చించారు. రాయచూరు రైల్వే స్టేషన్‌లో ఉన్న లిఫ్టు చాలా చిన్నగా ఉందని, ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఎస్కలేటర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ఇంకా ఇతర అంశాలపై విజ్ఞప్తులు చేశారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతో శారీరక, మేధోవికాసం



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న రవిచెళ్లగుర్కి

**బళ్లారి సిటీ, సెప్టెంబరు 19:** క్రీడలు పిల్లలకు శారీరక, మానసిక దృఢత్వంతో పాటు వినోదాన్ని అందిస్తాయని కర్ణాటక రాష్ట్ర యాక్టివ్ టీచర్స్ ఫోరం బళ్లారి జిల్లా యూనిట్ అధ్యక్షుడు రవిచెళ్లగుర్కి అన్నారు. బళ్లారి నగరంలోని జిల్లా స్టేడియంలో జరిగిన బళ్లారి తాలూకా స్థాయి క్రీడా పోటీల్లో సంజీవరాయనకోట్ ప్రభుత్వ సీనియర్ ప్రాథమిక పాఠశాలకు చెందిన మేరీ చదరంగంలో, ఎనిమిదో తరగతికి చెందిన విజయలక్ష్మి 100మీటర్ల రేసు, హైజంప్‌లో పాల్గొని తృతీయస్థానం సాధించాలన్నారు. ఓడిపోయిన వారు మనస్ఫూర్తిగా ప్రయత్నించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, చన్నమ్మ, సుమతి, శ్వేత, ఉమ్మెహాని, శశమ్మ, రామాంజనేయ తదితరులున్నారు.

## కార్మిక సమస్యలను పరిష్కరించాలి




నిరసన తెలుపుతున్న మధ్యాహ్న భోజన కార్మికులు

**బళ్లారి సిటీ, సెప్టెంబరు 19:** తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం జిల్లాపంచాయతీ కార్యాలయం ఎదుట ఏఐయూటీయూసీ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐయూటీయూసీ జిల్లా కార్యదర్శి డా.ప్రమోదు మాట్లాడుతూ, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల ప్రతిష్ఠాత్మకమైన మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులకు అత్యంత తక్కువగా జీతం రూ.3600 మాత్రమే ఇస్తున్నారని, ఈ జీతం కూడా నెలనెలా రావడం లేదన్నారు. కొన్ని సార్లు ఇది 2-3నెలలకు ఒకసారి ఇస్తున్నారన్నారు. ఏప్రిల్, మే నెలల జీతాలు ఇప్పటివరకూ ఇవ్వలేదన్నారు. గుడ్ల పై పెంకును తీసే కూలీలకు కూడా కొన్నేళ్లుగా జీతాలు అందడంలేదన్నారు. గత బీజేపీ ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.1000 పెంచుతున్నట్లు ప్రకటించినా అమలు చేయకుండా కార్మికులను మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు జీతం రూ.6వేలకు పెంచుతామని హామీ ఇచ్చినా అది అమలుకు నోచుకోలేదన్నారు. కర్ణాటక యునైటెడ్ అక్షర దాసోహ లేబర్ అసోసియేషన్ జిల్లా కౌన్సిలర్ నాగరత్న మాట్లాడుతూ మధ్యాహ్న భోజనకార్మికులు వంటపని కాక ఇతర పనులను చేయవలసి వస్తోందన్నారు. సమస్యలపై డిప్యూటీసెక్రటరీ గిరిజాశంకర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్మికులకు జీతాలు చెల్లించని నేపథ్యంలో తక్షణమే చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏఐయూటీయూసీ మంజుళ, సురేశ్, మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

## ప్రజల దాహార్తిని తీరుస్తున్న
# కాంగ్రెస్ బావి



శతాబ్ది కాలం పూర్తి చేసుకున్న కాంగ్రెస్ బావి

**బళ్లారి గాంధీనగర్, సెప్టెంబరు 19:** దేశ స్వాతంత్ర్యం కోసం సమర యోధులు చేసిన త్యాగాలు, అప్పటి సంఘటనలకు సంబంధించిన కొన్ని సాక్ష్యాలు ఇంకా చెక్కుచెదరకుండా అందరికీ స్ఫూర్తిని పంచుతున్నాయి. ఇందులో భాగంగా బెళగావి నగరంలో 1924లో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో పాల్గొనే వారి నీటి అవసరాల కోసం తవ్విన ఓ బావి నేటికీ చెక్కుచెదరకుండా ప్రజల దాహార్తిని తీరుస్తోంది.

బెళగావి నగరంలో జరిగిన ఆ కాంగ్రెస్ సమావేశాలకు మహాత్మాగాంధీ ఆధ్వర్యం వహించారు. మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలోని గడినాడుగా పిలువబడుతున్న బెళగావి సమావేశంలో పాల్గొన్న వారి కోసం తవ్విన బావి ఇప్పటికీ ఆ సమావేశానికి సాక్షిగా నిలుస్తోంది. ఆ బావిని కాంగ్రెస్ బావిగా నేటికీ పిలవడం విశేషం. పోరాట వీరుల గడ్డగా చెప్పుకుంటున్న ఈ ప్రాంతం స్వాతంత్ర పోరాటంలో తనదైన పాత్ర వహించింది. బ్రిటీష వారిని మొట్టమొదటసారిగా ఓడించిన ఖ్యాతి ఈ నేలపై పుట్టిన వీరరాణి కిత్తూరు చెన్నమ్మకు దక్కుతుంది. ఇలాంటి నేలపై 1924 సంవత్సరం, డిసెంబరు 26, 27 తేదీల్లో రెండు రోజుల పాటు 39వ కాంగ్రెస్ సమావేశం జరిగింది. అంతకు మునుపు 1923లో ఆంధ్రప్రదేశ్ కాకినాడలో 38వ కాంగ్రెస్ సమావేశం జరిగింది. ఆ సమయంలోనే తరువాత సమావేశం కర్ణాటకలో నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. ఆ ప్రకారం కర్ణాటక రాష్ట్రంలోని బెళగావి నగరంలో సమావేశం నిర్వహించాలని జాతీయ నాయకులు ప్రకటించారు. ఈ బృహత్తర సమావేశాన్ని విజయవంతం చేయడానికి కర్ణాటక కేసరి గంగాధరావ్ దేశ్‌పాండే, గోవిందరావ్ యాళగి, అణ్ణా గురుజీలతో పాటు మరికొందరు సమావేశ బాధ్యతలు చేపట్టారు. సమావేశంలో పాల్గొనే వారికి వసతి, తాత్కాలిక రైలు స్టేషన్ లాంటి ఏర్పాట్లు సిద్ధం చేశారు. సమావేశానికి అవసరమైన స్థలాన్ని గుర్తించి దానికి విజయనగర అని నామకరణం చేశారు. సమావేశంలో సుమారు 30వేల మంది ప్రజలు పాల్గొనేందుకు అవకాశం ఉందని భావించిన నాయకులు వారికి అవసరమైన నీటి సౌకర్యం కోసం ఏకంగా ఓ బావినే తవ్వారు. ఆ బావి నేటికీ ఉపయోగంలో ఉంది. నేడు ఆ బావిని కాంగ్రెస్ బావిగా పిలుస్తుండడం విశేషం. బావి తవ్వుతున్న సమయంలో నారాయణ పరపనహళ్ళి అనే తొమ్మిదేళ్ళ బాలుడు ఆటలాడుతూ అందులో పడి మృతి చెందాడు. ఆ సందర్భంగా స్థానికులు బావిని సగానికి తవ్వి వదిలేయడంతో పాటు సమావేశానికి దానిని అపశకునంగా భావించారు. అయితే సగానికి ఆగిపోయిన బావి బదులుగా కొత్తగా బావిని తవ్వితే ఖర్చు అవుతుందని భావించిన నేతలు ప్రజలకు నచ్చజెప్పి తిరిగి బావిని తవ్వే పనులు చేపట్టడంతో సమస్యకు పరిష్కారం లభించింది. అనంతరం గంగాధర్ రావ్ దేశ్‌పాండే సమావేశం ముగిసిన తరువాత బావిని పూడ్చివేస్తామని స్థానికులకు హామి పత్రం రాసిఇవ్వడంతో బ్రిటీష అధికారులు ఆగిపోయిన బావిని తవ్వేందుకు అనుమతి ఇచ్చినట్లు తెలుస్తోంది. అన్ని కష్టనష్టాల నడుమ పనులు పూర్తి చేసుకున్న తరువాత బావి లోకి నీరు కూడా వచ్చింది. ప్రవేశ ద్వారం వద్ద ఓ గోడపై కన్నడ, ఆంగ్ల బాషలో పంపా సరోవర అంటూ రాశారు. ఈ ప్రదేశాన్ని హంపి విరుపాక్ష దేవాలయం గోపురం నమూనాలో నిర్మించారు. స్వాతంత్ర్యం అనంతరం పంపాసరోవరం పేరుతో పిలువబడుతున్న ఈ బావిని క్రమంగా... కాంగ్రెస్ బావిగా స్థానికులు పిలవడం ప్రారంభించారు. ఇలా ఆ బావి సమర యోధుల స్మారకంగా నిలిచిపోయింది.



బావిలో స్వచ్ఛంగా ఉన్న నీరు



పంపాసరోవర పేరుతో నామఫలకం

# గర్భవతుల స్క్రీనింగ్‌ను నిర్లక్ష్యం చేయవద్దు

● మాతాశిశు మరణాలపై సమీక్షలో డీహెచ్ఓ రమేష్‌బాబు

**బళ్లారి సిటీ, సెప్టెంబరు 19:** గర్భిణీ స్త్రీలు, నవజాత శిశువుల చెకప్‌లను నిర్లక్ష్యం చేయకూడదని, మాతాశిశు మరణాల నివారణకు వైద్యాధికారులు, సిబ్బంది క్రియాశీలకంగా వ్యవహరించాలని జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ( డీహెచ్ఓ) అధికారి డాక్టర్ రమేశ్‌బాబు తెలిపారు. జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అధికారి కార్యాలయం హాల్లో ఏర్పాటు చేసిన మాతాశిశు మరణాలపై జిల్లా స్థాయి సమీక్షా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటింటికి వెళ్ళి వ్యక్తిగత పనుల కారణంగా తనిఖీలు ఆలస్యం కాకుండా సభ్యులను ఒప్పించాలని సూచించారు. గర్భిణీ స్త్రీలను గుర్తించిన తర్వాత నిరంతర నిఘా ఉంచాలని. రక్తపోటుపరీక్షల్లో తేడా వస్తే ఉపకేంద్రం, ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో పరిశీలించి అవసరమైనే వెంటనే నిపుణులైన వైద్యుల వద్దకు పంపాలని తెలిపారు. స్థానిక చికిత్స మెరుగు పడకపోతే రక్తహీన నిపుణుడిని సంప్రదించాలన్నారు. అవసరమైతే స్కానింగ్ చేయించుకోవాలని సూచించాలని తెలిపారు. మొదటి డెలివరీ శస్త్రచికిత్స ద్వారా అయితే తిరిగి గర్భం ధరించే కాలాన్ని కనీసం 3సంవత్సరాలపాటు వాయిదా వేయాలన్నారు. ఇందుకోసం ఇంట్రా ఇనాక్యులేషన్, వ్యాక్సినేషన్ గురించి తెలియజేయాలన్నారు. మరీ ముఖ్యంగా గర్భిణీని ఉన్నత స్థాయి ఆసుపత్రికి తరలించే సమయంలో 108 వాహనం రావడంలో జాప్యం జరిగితే వైద్యాధికారులు వెంటనే ప్రత్యామ్నాయ రవాణా ఏర్పాటు చేయాలని డీహెచ్ఓ తెలిపారు. ప్రసూతి సమస్యను ప్రాధాన్యతగా తీసుకుని స్థానిక గ్రామపంచాయితీ అధ్యక్షుడు, సభ్యులతో సమన్వయ సమావేశం నిర్వహించాలన్నారు. తమ పరిధిలోని గర్భిణుల సంరక్షణను పర్యవేక్షించేలా చర్యలు తీసుకోవాలన్నారు. విమ్స్ ప్రసూతి విభాగాధిపతి డాక్టర్ ఆశారాణి మాట్లాడుతూ, వైద్యాధికారులు తమ సిబ్బంది, ఆశా వర్కర్లతో ప్రతి వారం గర్భిణుల ఇంటి సందర్శన, ఆరోగ్య స్థితిగతులపై చర్చించాలని సూచించారు. గర్భిణీ స్త్రీలు తమ ఆరోగ్య సమస్యలతో మతపరమైన ప్రదేశాలను సందర్శించరాదని వారు ఆసుపత్రిలో చికిత్స పొందాలని సూచించారు. గర్భిణులు ప్రమాదాలకు గురైతే ఆదుకునే వారు లేకుంటే మహిళా శిశు అభివృద్ధి శాఖకు సమాచారం అందించి సంరక్షణ కేంద్రానికి పంపించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో విమ్స్ ప్రసూతి వైద్యురాలు డాక్టర్ ఆశారాణి, విమ్స్ పీడియాట్రిక్ విభాగాధిపతి డాక్టర్ విశ్వనాథ్, జిల్లా ఆర్సీ హెచ్ అధికారి డాక్టర్ హనుమంతప్ప,జిల్లా ఆసుపత్రి ప్రసూతి వైద్యుడు డాక్టర్ అష్రఫ్ అలీ, చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ బాలు వెంకటేశులు, విమ్స్ నోడల్ అధికారి డాక్టర్ రాజేశ్, డా.మంజునాథ్ జవలి, డా.అరుణ్‌కుమార్, జిల్లా ఆరోగ్య విద్యాధికారి ఈశ్వర్ దాసప్పనవర్, డీఎస్ఓ గిరీశ్, వైద్యాధికారులు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీహెచ్ఓ రమేశ్‌బాబు తదితరులు

# తుంగభద్ర జలాశయానికి తగ్గిన ఇన్‌ఫ్లో

● డ్యాం క్రస్ట్‌గేట్లు పూర్తిగా బంద్

**బళ్లారి సిటీ, సెప్టెంబరు 19:** తుంగభద్ర జలాశయం ఇన్‌ఫ్లో తగ్గడంతో నీటిని నిల్వ చేసేందుకు మంగళవారం నుంచి క్రస్ట్ గేట్లను పూర్తిగా మూసివేశారు. ఇన్‌ఫ్లో 10,583 క్యూసెక్కులు ఉండగా, కాల్వల్లోకి వచ్చే నీటి పరిమాణం 10,696 క్యూసెక్కులుగా ఉంది. అందువల్ల నదికి నీటి విడుదలను పూర్తిగా నిలిపివేసినట్లు తుంగభద్ర బోర్డు తెలిపింది. డ్యాం గరిష్ఠమట్టం 1,633 అడుగులు కాగా ప్రస్తుత నీటి మట్టం 1,632 అడుగులు ఉంది. 105.78 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం ఉన్న రిజర్వాయర్‌లో ప్రస్తుత 101.77 టీఎంసీల నీరు నిల్వ ఉంది. రిజర్వాయర్ ఇన్‌ఫ్లో కాలువలకు విడుదల చేసే నీటి పరిమాణానికి సమానంగా ఉండడంతో మరికొద్దిరోజుల పాటు ఇదే స్థాయిలో డ్యాంలో నీరు ఉండే అవకాశం ఉందని భావిస్తున్నారు. జిల్లా కలెక్టర్ ఎం.దివాకర్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో రెండో పంటకు కూడా నీరు వచ్చే అవకాశం ఇప్పుడిప్పుడే కనిపిస్తోందన్నారు. వానాకాలం బాగానే ఉన్నా రెండో పంటకు సరిపడా నీరు వస్తుందన్న నమ్మకంతో రైతులు ఉన్నారు. మొత్తం 33 గేట్లను వెంటనే మార్చాలని బృందంలోని నిపుణులు మౌలికంగా తెలియజేసినట్లు బోర్డు వర్గాలు తెలిపాయి.



మూతబడిన క్రస్ట్‌గేట్లు

## బ్యాంకు అధికారుల నేతృత్వంలో స్వచ్ఛభారత్



పీడీహళ్లి బ్యాంకు అధికారుల నేతృత్వంలో పారిశుధ్య పనులు

**బళ్లారిరూరల్, సెప్టెంబరు 19:** తాలుకాలోని వై కగ్గల్లు గ్రామంలో పీడీహళ్లి కెనరా బ్యాంకు అధికారులు మహిళా సంఘ సభ్యుల ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ మహిళలను రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. బ్యాంకులు ఇచ్చే రుణాల వల్ల కుట్టుమిషన్లు, తదితరాలను ఏర్పాటు చేసుకుని ప్రతి నెల కిస్తీలు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో డ్వాక్రా పలు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

## ఏపుగా పెరుగుతున్న వరి



మాగాణి భూముల్లో కలుపుతీస్తున్న కూలీలు

**బళ్లారిరూరల్, సెప్టెంబరు 19:** తాలుకాలోని మోకా, భైరదేవనహళ్లి, గోటూరు, కేకేహళ్లి, వనగనూరు, ఎర్రగుడితో పాటు ఎల్ఎల్‌సీ కింద వరి పంట వేసుకున్న రైతన్నలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సంవత్సరం వేదావతి నది ఉధృతంగా ప్రవహించడంతో పాటు తుంగభద్ర నదికి అత్యధికంగా నీరు రావడంతో రైతన్నలు ముందస్తుగా మాగాణి పంటలు వేసుకున్నారు. డ్యామ్ గేటు కొట్టుకుపోవడంతో రైతన్నలు ఆందోళన చెందారు. అయినా ఇంజనీర్లు అతి తక్కువ సమయంలో మరొక గేటును అమర్చడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. చూస్తుండగానే రెండునెలలు దాటి పంటలు ఏపుగా పెరగడంతో పలు గ్రామాల రైతులు, ఇంజనీర్లకు టీబీ డ్యామ్ బోర్డు అధికారులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

## ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

**సిరుగుప్ప, సెప్టెంబరు 19 :** విపుల చేతన గ్రామీణ పునర్వసతి కార్యకర్తల పోస్టులకు ఇంటర్వ్యూలు జరిగాయి. గురువారం సిరుగుప్ప పట్టణం తాలుకా పంచాయతీ కార్యనిర్వహణాధికారి పవన్‌కుమార్ దండప్ప సమక్షంలో కొంచిగేరి, భైరాపురం, తదితర చోట్ల ఖాళీగా వున్న పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా విపుల చేతన అధికారి గోవిందయ్య, తాలుకా ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి ఈరణ్ణ, టీడీపీ ప్రదీప్, విద్యాశాఖాధికారి గురప్ప, బుద్ధిమాంద్య పిల్లల పాఠశాలల మేనేజర్ మహేష్ తిదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు పనులకు భూమిపూజ

**కంప్లి, సెప్టెంబరు 19 :** కంప్లి, హోస్పేట రోడ్డు బైపాస్ పనులకు రూ. రెండు కోట్లతో వాల్మీకి సర్కిల్‌లో ఎమ్మెల్యే భూమిపూజ చేపట్టారు. కంప్లి నుంచి కణివి తిమ్మలాపురం క్రాస్ వరకు ఆరు కిలోమీటర్లు పూర్తిగా ధ్వంసమై ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అలాగే కురుగోడు ఎమ్మిగనూరు ప్రాంతాలలో రోడ్డు పనులు చేపట్టామన్నారు. అలాగే పట్టణంలోని 23వవార్డులో అభివృద్ధి పనులు చేస్తామని తెలిపారు. ఆయనతోపాటు కౌన్సిలర్ బట్టా ప్రసాద్, వీరాంజనేయులు, నారాయణ, ఈవో శ్రీకుమార్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే మునిరత్ననాయుడును బహిష్కరించాలి



పోలీస్ అధికారి సిద్రామేశ్వర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఎరుకుల స్వామి

**బళ్లారి సిటీ, సెప్టెంబరు 19:** షెడ్యూల్డ్ కులాలు, ఒక్కలిగ వర్గాల గురించి మహిళలను అనరాని మాటలతో దూషించినందుకు గాను బెంగళూరు రాజేశ్వరి నగర్ అసెంబ్లీ సభ్యుడు మునిరత్న నాయుడు రాజీనామా చేయాలని బళ్లారి జిల్లా ఎస్సీ సంఘాల జిల్లాధ్యక్షుడు ఎరుకులస్వామి అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే మునిరత్న నాయుడు బీబీఎంపీ ఆర్థిక చర్చ సందర్భంగా కాంట్రాక్టర్ చెలువరాజుతో జరిపిన ఆడియో సంభాషణ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోందన్నారు. ఈవిషయంపై నగరంలోని గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ అధికారి సిద్రామేశ్వర్‌కు ఆయన వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంలో ఆయనతోపాటు కౌల్‌బజార్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మంజునాథ, బ్రూస్‌పేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయకుమార్,టీ. ఆనంద్,సి.రాజు కందుకురురాముడు, గోవిందరాజులు, రామన్న, నాగరజా, మల్లికార్జున, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# హోసూరు జోన్

## కలెక్టర్ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ పనులు



బిళిగుండ్లు పంచాయతీలో పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతున్న కలెక్టర్

**హోసూరు(కృష్ణగిరి) సెప్టెంబరు 19 :** కృష్ణగిరి జిల్లా అంచెట్టి బస్టాండ్, గరటి, చిక్కమంజి, దొడ్డూరు పంచాయతీ యూనియన్, బిళిగుండ్లు పంచాయతీలో స్వచ్ఛభారత్ ఉద్యమం తరఫున గురువారం పరిశుభ్రత పనులు జరిగాయి. జిల్లా కలెక్టర్ సరయు మొక్కజొన్న చెత్తను వేరు చేసే చిన్న తరహా కంపోస్టు పనులను సందర్శించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, ప్రజలకు ప్రధాని మోదీ జన్‌మాన్ పథకం క్రింద రూ.4 లక్షల 7 వేల ఇళ్లు నిర్మించేందుకు మంజూరు చేశారన్నారు. రూ.27 లక్షల విలువ చేసే రూరల్ హౌసింగ్ రిపేర్ స్కీమ్ కింద ఒక్కొక్కటి రూ.లక్ష 50 వేలు చొప్పున మొత్తం 18 ఇళ్లను ఇచ్చారన్నారు. అదేవిధంగా ప్రతిరోజు పనివారి ఇళ్లకు నీరు సరపరా చేయాలని తెలిపారు. కూలీకార్మికుల సహకారం ఉంటేనే పనులు నాణ్యతగా సాగుతాయని సూచించారు.

వారి పిల్లలను బడికి పంపాలని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం ముఖ్యమంత్రి అల్పాహార పథకం క్రింద దొడ్డమంజి పంచాయతీ, చిక్కమంజి, దొడ్డూరు పంచాయతీ యూనియన్ ప్రాథమికోన్నత పాఠశాలల్లో పాఠశాల విద్యార్థుల సంఖ్య, రోజువారీ హాజరైన ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అలాగే చిక్కమంజి పంచాయతీ యూనియన్ ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న పనురుద్ధరణ పనులను కలెక్టర్ పరిశీలించారు.

## క్యూఆర్ కోడ్ ద్వారా అమరవీరుల వివరాలు



**హోసూరు(కృష్ణగిరి) సెప్టెంబరు 19 :** విద్యార్థులు క్యూ ఆర్ కోడ్ ద్వారా స్కాన్ చేయడం ద్వారా, తమిళనాడులోని అన్ని స్మారక చిహ్నాలు, మైదానాలు, విగ్రహాలు, భారత స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న అమరవీరుల గురించి సమాచారాన్ని తెలుసకోవచ్చునని కలెక్టర్ తెలిపారు. కృష్ణగిరి కలెక్టర్ కార్యాలయ సముదాయం, హోసూరు ప్రాంతీయ రవాణా కార్యాలయ సముదాయంవద్ద , ప్రభుత్వ కార్యాలయాల ప్రవేశద్వారం వద్ద ప్రజల సౌకర్యార్థంతః క్యూఆర్‌కోడ్‌ను ఏర్పాటుచేశారు. వీటి ద్వారాఅమరవీరుల గురించి తెలుసుకోవాలన్నారు.

## మహిళా వాలీబాల్ టోర్నీకి 40 జట్లు

**హోసూరు సెప్టెంబరు 19 :** మధురైలోని ఓ ప్రైవేట్ కళాశాలలో మీనా సుందరి ఫౌండేషన్ తరఫున గురువారం ఐదో సంవత్సరం రాష్ట్ర స్థాయి మహిళల వాలీబాల్ టోర్నమెంట్ జరిగింది. ఇందులో వివిధ జిల్లాల నుంచి 40కిపైగా బృందాలు పాల్గొన్నాయి. ఈ టోర్నీల్లో హోసూరు ప్రాంతంలో శిక్షణ పొందుతున్న మహిళల వాలీబాల్ జట్టు రెండో స్థానం సాధించింది. ఈ పోటీల్లో ఉత్తమ క్రీడాకారిణిగా ఎన్.కీర్తన ఎంపికైంది, హోసూరు బాలికల జట్టు రాష్ట్ర స్థాయిల్లో ద్వితీయ స్థానంలో నిలవడంతో హోసూరు బాలికల జట్టును కోచ్ మాణిక్యవాసగంను అందరూ అభినందించారు.



ద్వితీయ స్థానం సాధించిన హోసూరు జట్టు

# అసంపూర్తి పనులపై మంత్రి ఆగ్రహం

**రాయచూరు సెప్టెంబర్ 19:** నగరంలోని మహిళా సమాజం ఆవరణలో నిర్మిస్తున్న ఓపెన్ ఆడిటోరియం ఇప్పటికీ అసంపూర్తిగా ఉండడాన్ని రాష్ట్ర చిన్ననీటి పారుదల శాఖ మంత్రి ఎన్ఎస్ భోసరాజు తప్పుబట్టారు. ఈ విషయంలో అధికారులు తమ నిర్లక్ష్యాన్ని వీడి పనులను వెంటనే పూర్తి చేసేందుకు తగిన కార్యచరణ సిద్ధం చేయాలని ఆదేశించారు. గురువారం ఆడిటోరియం పనులను పరిశీలించిన మంత్రి గతంలో పనులను పరిశీలించిన సందర్భంగా ఇచ్చిన హామిలు ఆదేశాలు ఇప్పటి వరకు అమలు కాకపోవడాన్ని తీవ్రంగా పరిగణించారు. పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి ప్రజలకు సౌకర్యం ఉండేలా చూడాలన్నారు. మంత్రి వెంట నగరసభ అధ్యక్షుడు నరసింహలు ఉన్నారు.



అధికారులను మందలిస్తున్న మంత్రి భోసరాజు

## రేపు ఉపాధ్యాయ దినోత్సవం



మాట్లాడుతున్న సంగమేశ్ మంగానవర్

**రాయచూరు సెప్టెంబర్ 19:** మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వపల్లిరాధాకృష్ణన్ జయంతి, జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమాన్ని ఈనెల 21వ తేదీన నిర్వహిస్తున్నట్లు కర్ణాటక రాష్ట్ర ఎయిడెడ్ పాఠశాలల సంఘం అధ్యక్షుడు సంగమేశ్ మంగానవర్ తెలిపారు. గురువారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. నగర సమీపంలోని యరమరస్ క్యాంప్ వద్దగల ఫంక్షన్ హాల్‌లో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర చిన్ననీటి పారుదల శాఖ మంత్రి ఎన్ఎస్ భోసరాజు, ఎంపీ జీ కుమార్ నాయక్, ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు హాజరవుతారన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ బోధకులుగా గుర్తించిన 20 మంది ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులకు అవార్డులను ప్రదానం చేస్తామన్నారు. కార్యక్రమానికి ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు, విద్యావంతులు హాజరుకావాలని కోరారు.

## నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

### డాక్టర్ అయ్యగారి సాంబశివరావు (జయంతి)



ఏఎస్ రావుగా చిరపరిచితులైన దేశంలోనే ఎలక్ట్రికల్ ఇంజనీర్‌గా పేరొందిన 'పద్మభూషణ్' గ్రహీత అయ్యగారి సాంబశివ రావు 1914 సెప్టెంబరు 20న పశ్చిమ గోదావరి జిల్లా మోగల్లులో జన్మించారు. ఇంజనీర్, శాస్త్రవేత్తగా రాణించారు. హైదరాబాద్‌లోని ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇండియా లిమిటెడ్ (ఇసిఐఎల్) సంస్థాపకులలో ఒకరు. అణుశక్తి విభాగంలో హోమీ భాభా, విక్రమ్ సారాభాయ్ వంటివారితో కలసి పనిచేశారు. అణురియాక్టర్ అప్సరకు కంట్రోల్, మానిటరింగ్ పరికరాలు సమకూర్చారు. ముంబైలోని టీఐఎఫ్ఆర్‌లో కాస్మిక్ కిరణాల పరిశోధనలో విజయం సాధించారు. పద్మశ్రీ, శాంతిస్వరూప్ భట్నాగర్, గౌరవ డాక్టరేట్‌లు ఇతరత్రా గౌరవాలు పొందారు. 2003 అక్టోబరు 31న కన్నుమూశారు.

### అక్కినేని నాగేశ్వరరావు (జయంతి)



ఏఎన్నార్‌గా చిరపరిచితులైన అక్కినేని నాగేశ్వరరావు 1923 సెప్టెంబరు 20న కృష్ణా జిల్లా నందివాడ మండలం రామాపురంలో జన్మించారు. ఎన్టీఆర్‌తో కలసి తెలుగు సినీ పరిశ్రమకు మూలస్తంభంగా నిలిచారు. 1975లో భార్య పేరిట అన్నపూర్ణ స్టూడియో ఏర్పాటు చేశారు. నటుడు, నిర్మాత, రచయితగా రాణించారు. నాటకాల ద్వారా వెండితెరపైకి వచ్చారు. ఏడు దశాబ్దాలలో పౌరాణిక, జానపద, సాంఘిక చిత్రాలలో సుమారు 255 సినిమాల్లో నటించి 'నట సామ్రాట్'గా పేరొందారు. పద్మశ్రీ, దాదాసాహెబ్‌ఫాల్కే అవార్డు, ఫిల్మ్‌ఫేర్, నంది అవార్డులు ఇతర పురస్కారాలు అందుకున్నారు. 'పద్మవిభూషణ్' అందుకున్న తొలి తెలుగు నటుడు. 2014 జనవరి 22న కన్నుమూశారు.

### ధర్మవరపు సుబ్రమణ్యం (జయంతి)



ప్రముఖ హాస్యనటుడు ధర్మవరపు సుబ్రమణ్యం 1960 సెప్టెంబరు 20న ప్రకాశం జిల్లా బల్లికురవ మండలం కొమ్మినేనివారిపాలెంలో జన్మించారు. అత్యధిక రెమ్యూనరేషన్ పొందిన హాస్యనటులలో ఒకరిగా నిలిచారు. ఏపీ కల్చరల్ అసోసియేషన్ ఛైర్మన్‌గా వ్యవహరించారు. రెండు నంది అవార్డులు అందుకున్నారు. అంతకుముందు ప్రజానాట్యమండలి తరపున ఎన్నో నాటకాలు, ప్రదర్శనలు ఇచ్చారు. నటించి, దర్శకత్వం వహించిన దూరదర్శన్‌లో ప్రసారమైన 'ఆనందో బ్రహ్మ' సీరియల్ ఎంతో పేరొందింది. 2013 డిసెంబరు 7న కన్నుమూశారు.

### జీన్ సిబెలియస్ (వర్ధంతి)



ఫిన్లాండ్ దేశానికి చెందిన గొప్ప వయోలిన్ వాద్యకళాకారుడు జీన్ సిబిలియస్ 1865 డిసెంబరు 8న జన్మించారు. సంగీతం ద్వారా ఫిన్లాండ్ దేశంలో జాతీయ గుర్తింపు పొందారు. సెవెన్త్ సింఫనీ, ఇతర సంగీత కార్యక్రమాలు అంతర్జాతీయ పేరొందాయి. 1957 సెప్టెంబరు 20న కన్నుమూశారు. ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు సాగాయి. కాగా ఆయన జయంతిని 'డే ఆఫ్ ఫినిష్ మ్యూజిక్'గా ఆచరిస్తున్నారు.

### సౌందర్య రజినీకాంత్ (పుట్టినరోజు)



ఇండియన్ గ్రాఫిక్ డిజైనర్‌లలో ఒకరిగా పేరొందిన సౌందర్య రజినీకాంత్ 1984 సెప్టెంబరు 20న మద్రాస్‌లో జన్మించారు. అసలు పేరు షాకుబై రావ్ గైక్వాడ్. తమిళ సినీరంగంలో నిర్మాతగా, దర్శకురాలిగా రాణిస్తున్నారు. తమిళ సూపర్‌స్టార్, తండ్రి రజనీకాంత్ ప్రోత్సాహంతో ఇండియాలో తొలి మోషన్ కాప్చర్ సినిమా 'కొచాడియాన్'కు దర్శకత్వం వహించారు. ఈసినిమా 'టెక్నికల్ ఇన్నోవేషన్ ఇన్ ఫిల్మ్'గా గుర్తింపు పొందింది. 2002 నుంచి సినీరంగంలో కొనసాగుతున్నారు. సొంతంగా ప్రొడక్షన్ సంస్థను ఏర్పాటు చేశారు.

## విషజ్వరంతో మహిళ మృతి

**రాయదుర్గం రూరల్, సెప్టెంబరు 19:** అనంతపురం జిల్లా రాయదుర్గం మండలం కెంచానపల్లి గ్రామానికి చెందిన జ్యోతి (33) విషజ్వరంతో గురువారం మృతి చెందిందివ. మూడురోజుల నుంచి జ్వరం తో బాధపడుతూ ఉండేదని, బుధవారం జ్వరం ఎక్కువ కావడంతో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

# యువ పరిశోధకులను ప్రోత్సహించాలి

**శిడ్లఘట్ట, సెప్టెంబరు 19:** విజ్ఞానాన్ని బాగా అర్థం చేసుకుంటే సమాజంలోని అనేక మూఢాచారాలను తొలగించే అవకాశం ఉందని, ఈ దిశగా పరిశోధనలపై యువతను ప్రోత్సహించాలని, యువశాస్త్రజ్ఞుల అవసరం జాతికి ఎంతైనా అవసరం ఉందని విద్యా విభాగానికి చెందిన మంజునాథ్ అభిప్రాయపడ్డారు. తాలూకాలోని నడిపినాయకనహళ్ళిలోని నవోదయ వసతి హైస్కూల్‌లో తాలూకా విద్యాశాఖ, సాక్షరతాశాఖ, బెంగళూరు విశ్వేశ్వరయ్య సైన్స్ అండ్ టెక్నలాజికల్ మ్యూజియం సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటైన కార్యక్రమంలో తాలూకాస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్, నాటక పోటీలను ప్రారంభించి మాట్లాడారు. ప్రాచీన కాలంలోనే భారతీయరుషులు విజ్ఞానానికి అందించిన సేవలు అపారమన్నారు. మనదేశంలో గతంలో ఎన్నో శాస్త్రీయ పరిశోధనలు వైద్యరంగంలో ఉన్నాయన్నారు. భారతశాస్త్రవేత్తలు ప్రపంచంలో ఉత్తమ సాధన చేశారన్నారు. వీరు ఇతరదేశాల శాస్త్రవేత్తలకు ఆదర్శంగా ఉన్నారన్నారు. చిన్నారుల సైన్స్ ప్రయోగాల ప్రదర్శనను నవోదయ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు కే సత్యనారాయణ అభినందించారు. శాస్త్రీయ అంశాలు కూడా జీవనంలో అలవరచుకోవాలన్నారు. నేర్చుకోవడం ద్వారా సైన్స్ ప్రయోగాలు చేయడం ద్వారా అన్వేషణ తత్వం నేర్చుకోవాలన్నారు. కొత్త అంశాలపై దృష్టి సారించాలన్నారు. హైస్కూల్ విద్యార్థులు వ్యక్తిగతంగా, బృందాలుగాను ప్రదర్శనలు ఇచ్చారు. విజేతలకు ప్రశంసాపత్రం బహుమతులు ప్రదానం చేశారు. తాలూకా హైస్కూల్ స్కూల్ అసిస్టెంట్‌ల సంఘం కార్యదర్శి రుద్రేశ్‌మూర్తి, ఉపాధ్యాయులు లక్ష్మీప్రసాద్, ప్రశాంత్‌కుమార్, విశ్వనాథ్, సవితా తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభావంత విద్యార్థులతో ఉపాధ్యాయులు తదితరులు

## వసతి, ఉద్యోగాలు కల్పించండి

» జిల్లా అధికారికి మాజీ మావోయిస్టుల వినతి

**బెంగళూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి):** భూమి, వసతి, ఉద్యోగానికు సంబంధించి ప్రభుత్వం వెంటనే పరిష్కారం చూపించాలని ఐదుగురు మాజీ నక్సల్స్ చిక్కమగళూరు జిల్లా అధికారి మీనా నాగరాజ్‌కు బుధవారం విన్నవించారు. కొన్నేళ్లపాటు నక్సల్స్‌గా కొనసాగినవారు జనజీవనస్రవంతిలోకి చేరిన తర్వాత ప్రభుత్వం అందించే సౌలభ్యాలు సమకూర్చాలని కోరారు. జనజీవనస్రవంతిలోకి చేరి ఎనిమిదేళ్ల పూర్తి అవుతున్నా ఎటువంటి పరిహారం ఇవ్వలేదన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీని విస్మరించిందన్నారు. ఎందుకోసం జనజీవనస్రవంతిలోకి వచ్చామనే బాధ కలుగుతోందని జిల్లా అధికారి ముందు వాపోయారు. మాజీ నక్సల్స్ సిరిమనె నాగరాజు, నిలగుళి పద్మనాభ్, మూర్ శ్రీధర్, శివు, పరశురామ్‌లు జిల్లా అధికారిని కలిసినవారిలో ఉన్నారు. 2016-17లో నక్సల్స్ జీవనాన్ని వీడామన్నారు. భూమి, వసతి, ఉద్యోగం కల్పిస్తామని, కేసులను రద్దు చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. జనజీవనస్రవంతిలోకి చేరినప్పుడు జిల్లాఅధికారులు హామీ ఇచ్చారని వాటిని అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. 2016లో నలుగురు, 2017లో ముగ్గురు లొంగిపోయామన్నారు. కన్యాకుమారి అనే మహిళా నక్సల్ లొంగిపోయేందుకు ముందే పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారన్నారు. ఎనిమిదేళ్ల ముగుస్తున్నా ఆమె జైల్లోనే గడుపుతున్నారని, ఐదేళ్లబిడ్డకూడా కొంతకాలం జైలులో గడిపి ఇటీవల బయటకు వచ్చిందన్నారు. జిల్లా యంత్రాంగం నక్సల్స్ కలాపాలు వీడి ప్రజాజీవనంలోకి రావాలని సూచించారని, అయితే మా పిల్లలు ఉచిత విద్యతోపాటు ఏ సౌలభ్యం కూడా తీర్చలేదని విన్నవించారు.



జిల్లా అధికారికి విన్నవిస్తున్న మాజీ నక్సల్స్ బృందం

## బాలికా విద్యను ప్రోత్సహించాలి: ఎమ్మెల్సీ



సొసైటీ నూతన భవన శంకుస్థాపనలో ఎమ్మెల్సీ తదితరులు

**చిక్కబళ్ళాపుర, సెప్టెంబరు 19:** బాలికలను నిర్లక్ష్యం చేయకుండా వారి విద్యను ప్రోత్సహించాలని ఎమ్మెల్సీ నసీర్ అహ్మద్ అభిప్రాయపడ్డారు. నగర శివారులోని సీవీవీ క్యాంపస్‌లో మహ్మదియా ఇంగ్లిష్ స్కూల్ హిలాల్ ఎడ్యుయేషన్ సొసైటీ నూతన భవన శంకుస్థాపనలో పాల్గొని మాట్లాడారు. చదువుకు పేదరికం అడ్డు కారాదన్నారు. కష్టాలను లెక్కచేయకుండా పేదరికంమధ్య చదువును పూర్తి చేసిన మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం అందుకు ఉదాహరణ అన్నారు. పంచగిరి విద్యాసంస్థల అధ్యక్షుడు కేవీ నవీన్ కిరణ్ మాట్లాడుతూ చిక్కబళ్ళాపుర నగరం విద్యాహబ్‌గా మారిందన్నారు. నగరానికి నాలుగువైపులా విద్యాసంస్థలు ఉన్నాయని, ఉత్తమ విద్యాసంస్థగా ఎదగాలన్నారు. హిలాల్ ఎడ్యుకేషన్ సొసైటీ కేవలం హైస్కూల్‌కే పరిమితం కాకుండా డిగ్రీ కళాశాలను ప్రారంభించేందుకు చర్యలు చేపట్టి ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. వ్యవసాయశాఖ సంయుక్త కార్యదర్శి జావీద్ నసీమాఖానం మాట్లాడుతూ నేటిబాలలే రేపటి పౌరులని వారికి మంచి విద్యను అందించాలన్నారు. ఫాల్కన్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ ఎండీ అబ్దుల్‌సుభాన్, ఏఎస్పీ రాజా ఇమామ్ ఖాసీం, కాంగ్రెస్ నాయకుడు ఆంజినప్ప, హిలాల్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు మక్సాన్ రఫీక్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## ఐకమత్యంతో బలోపేతం కావాలి

**శిడ్లఘట్ట, సెప్టెంబరు 19:** ఫొటోగ్రాఫర్‌లు నేటి సమాజానికి ప్రతిబింబంలా కనిపిస్తారని, ఐకమత్యంతో బలోపేతం కావడం ద్వారా సంఘాన్ని మరింత అభివృద్ధి చేయాలని కర్ణాటక ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ రాష్ట్ర డైరెక్టర్ బీడీకెరె రవికుమార్ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయ ఆవరణలో గురువారం ఏర్పాటైన సంఘం తాలూకా పదాధికారుల సమావేశంలో మాట్లాడుతూ ఫొటోగ్రాఫర్లలో ఐక్యత కొరవడిన కారణంగా ప్రభుత్వానికి మన సమస్యలు విన్నవించలేకపోతున్నామన్నారు. ఈ నేపథ్యంలో తాలూకాల వ్యాప్తంగా అందరూ సంఘటితం కావాలన్నారు. ప్రతి ఫొటోగ్రాఫర్ సంఘంలో సభ్యులు కావాలన్నారు. రానున్న రోజుల్లో సీనియర్ ఫొటోగ్రాఫర్‌లకు ప్రత్యేక గౌరవంతోపాటు కొత్త వారికి అవకాశం కల్పించదలిచామన్నారు. సీనియర్ ఫొటోగ్రాఫర్ రూపసి రమేశ్ మాట్లాడుతూ ఫొటోలు తీయడంలో ఇటీవల పోటీ పెరిగిందన్నారు. ఈనెల 20నుంచి 22వరకు బెంగళూరు ప్యాలెస్ మైదానంలో డిజె ఇమేజ్ నమ్మ ఇమేజ్ పేరిట పదో అంతర్జాతీయ ప్రదర్శన ఉంటుందన్నారు. దక్షిణభారత స్థాయిలో ఇది అతిపెద్ద ప్రదర్శన కానుందన్నారు. ఇదే సందర్భంగా రాష్ట్రస్థాయి సమావేశం ఉంటుందన్నారు. ఇందుకు సంబంధించి బ్రోచర్‌లను ప్రదర్శించారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, రాష్ట్ర డైరెక్టర్ గిరీశ్ ఆరాధ్య, జిల్లా ఇన్‌చార్జ్ నారాయణస్వామి, తాలూకా అధ్యక్షుడు మేఘనా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



అంతర్జాతీయ ప్రదర్శనకు సంబంధించి బ్రోచర్‌ల ఆవిష్కరణ

## కనీస వేతనాల కోసం అంగన్‌వాడీల ఆందోళన

**బెంగళూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి):** ఐసీడీఎస్ పథకంలో భాగంగా స్త్రీ శిశు సంక్షేమ అభివృద్ధిశాఖ కింద రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు సహాయకులకు కనీస వేతనాలు అమలు చేయాలనే డిమాండ్‌తో నగరంలో భారీ నిరసన చేపట్టారు. నిస్వార్థసేవతో విధులు నిర్వహిస్తున్నా కేవలం గౌరవధనానికి పరిమితం చేయడం ద్వారా పెరిగిన జీవనప్రమాణాలకు ఇది ఏమాత్రం సరిపోదన్నారు. ఈమేరకు ఫ్రీడంపార్కులో పెద్ద సంఖ్యలో చేరుకున్న అంగన్‌వాడీలు కనీస వేతనాలు అమలు చేయాలంటూ నినాదాలు చేసి ప్లకార్డులు ప్రదర్శించారు. వీరికి ఏఐటీయూసీ మద్దతు పలికింది. ఈమేరకు ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు వినతిపత్రం ఇవ్వనున్నట్టు ఏఐటీయూసీ నాయకులు తెలిపారు.



ఫ్రీడంపార్కులో ధర్నాలో అంగన్‌వాడీలు

## వ్యర్థాలతో ఎరువు తయారీపై అవగాహన



సదస్సులో కలెక్టర్ రవీంద్ర తదితరులు

**చిక్కబళ్ళాపుర, సెప్టెంబరు 19:** నగరంలో సాలిడ్‌వేస్ట్ మేనేజిమెంట్ పథకం కింద చిక్కబళ్ళాపుర మునిసిపాలిటీ, రైతుల భాగస్వామ్యంతో ఘన వ్యర్థాల నిర్వహణతో పొలాల్లో ఎరువుగా మారుస్తున్నట్టు కలెక్టర్ పిఎన్ రవీంద్ర వెల్లడించారు. జిల్లా యంత్రాంగం, చిక్కబళ్ళాపుర మునిసిపల్ కౌన్సిల్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ హ్యూమన్ సెటిల్‌మెంట్స్ (ఐఐహెచ్ఎస్), గోద్రెజ్ ప్రాపర్టీస్ లిమిటెడ్ సహకారంతో ప్రత్యేకంగా సాలిడ్‌వేస్ట్ మేనేజిమెంట్ అనే అంశంపై ప్రత్యేకంగా సదస్సు నిర్వహించారు. ప్రాజెక్టులో భాగంగా ఇప్పటికే 230మంది రైతులు గత ఆరు నెలల్లో సుమారు 1800 టన్నుల చెత్తను ఎరువుగా మార్చారన్నారు. సంస్థ సామాజిక బాధ్యతలో భాగంగా కంపోస్టు ఎరువు ఉత్పత్తి చేస్తున్న రైతులు, పాఠశాల విద్యార్థులను సత్కరించారు. సుమారు 75వేల జనాభా ఉన్న చిక్కబళ్ళాపుర నగరంలో రోజుకు 25వేల టన్నుల ఘన వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయన్నారు. నగర పాలక సంస్థ చైర్మన్ గజేంద్ర మాట్లాడుతూ నగరంలో ఉత్పత్తి అయ్యే 6 టన్నుల వ్యర్థాలను ప్రస్తుతం ప్రతిరోజు రైతులకు అందిస్తున్నామని రానున్న రోజుల్లో సుమారు 12వేల టన్నుల ముడివ్యర్థాలను వేరు చేసి రైతులకు అందజేసి మట్టిసారాన్ని పెంచనున్నట్టు తెలిపారు. గత ఆరు నెలల్లో 15మంది వలంటీర్ల ద్వారా 9 పాఠశాల, కళాశాలల్లో 3రోడ్‌షోలు, 6 వీధి నాటకాలు, అవగాహనా సదస్సులు నిర్వహించారన్నారు. సదస్సులో నగరసభ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఉమాశంకర్, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## పెట్టుబడుల కోసం ఐఐయూఎస్ఏ రోడ్‌షో




రోడ్‌షోలో ప్రముఖులు

**బెంగళూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి):** దేశం లో పెట్టుబడుల సాధనకోసం ఐఐయూఎస్ఏ సంస్థ ప్రధాన నగరాలలో రోడ్‌షోలకు శ్రీకారం చుట్టింది. ఐఐ యూఎస్ఏ పాస్‌పోర్ట్ సిరీస్ రోడ్‌షోను నగరంలో నిర్వహించారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అరుణ్‌గ్రావ్ మాట్లాడుతూ ఇండియా నుంచి ఇబి5 పెట్టుబడులను పెంచుకునేందుకు బెంగళూరులో తొలిసభకు ఆదరణ లభించిందన్నారు. పెట్టుబడిదారులు, వృత్తిపరమైన నిపుణుల కోసం సభ జరిపామన్నారు. ప్రాజెక్టు డెవలపర్‌లు, ఇమ్మిగ్రేషన్ అటార్నీలు ఆసక్తిగల పెట్టుబడిదారులను కలిపేందుకు సభలు జరిపామన్నారు. అంతర్జాతీయ స్థాయిలో వ్యాపార వాణిజ్యపరమైన వ్యవహారాలలో దోహద పడేందుకు రోడ్‌షో ప్రయోజనకరమైందన్నారు. మేయర్ లా గ్రూప్, సీఎంబీ ప్రాంతీయ కేంద్రాలు, సివిటాస్ కేంద్రాలు, ఫైన్‌స్టేట్ ఆర్‌సీ, గ్రీన్‌కార్డ్‌ఫ్రంట్‌తోపాటు గోల్డ్ స్పాన్సర్‌లు కాగా పదికిపైగా సిల్వర్‌స్పాన్సర్స్ భాగస్వామ్యులయ్యారన్నారు.

## విజయవంతంగా పక్షవాతానికి శస్త్రచికిత్స

**బెంగళూరు, సెప్టెంబరు 19 (ఆంధ్ర జ్యోతి):** నైజీరియా దేశానికి చెందిన 43ఏళ్ల కంటి వైద్యుడు గేబ్రియెల్ పాస్కుల్‌కు పక్షవాతానికి లోనుకాగా ట్రస్ట్‌వెల్ ఆసుపత్రిలో అత్యాధునిక చికిత్సలు అందించినట్టు డాక్టర్ విశ్వాస్ విజయ్‌దేవ్ వెల్లడించారు. ఈమేరకు గురు వారం నగరంలో ఒక ప్రకటన విడుదల చేశారు. ముఖం లోని నరాలకు పక్షవాతం, చెవి ప్రాంతంలోని ఎము కలకు బోన్‌ట్యూమర్ సమస్యతో ఉన్న గేబ్రియెల్ ట్రస్ట్ వెల్‌లో చేరారన్నారు. అతడు ఆసుపత్రికి చేరే సమయానికి మాట్లాడలేకపోయారని కళ్లల్లో నీరు వచ్చేదని మూసేందుకు ఇబ్బందిపడేవారని నోటి నుంచి ఆహారం కూడా బయటకు వచ్చేదన్నారు. ముఖంలో ఎటువంటి భావాలు వ్యక్తం చేయలేకపోయారన్నారు. ప్రముఖ అంకాలజీ స్పెషలిస్ట్‌ల సహకారంతో ట్రస్ట్‌వెల్‌కు చెందిన నిపుణులతో కలిపి సుమారు 12 గంటలపాటు నిరంతరంగా ఆపరేషన్‌లు చేశామన్నారు. ఇంట్రా ఆపరేటివ్ ద్వారా నరాల పర్యవేక్షణ చేశామన్నారు. ప్రస్తుతం అతను కోలుకున్నారన్నారు. వైద్యబృందంలో ఆనంద్ సుభాష్, స్తుతి మహాజన్, శ్రావ్య కాకొళ్లు ఉన్నారన్నారు.



కోలుకున్న రోగితో వైద్యుడు

## ఎమ్మెల్యే తీరుపై దళితసంఘాల నిరసన



నిరసనలో దళితసంఘాల నేతలు

**చిక్కబళ్ళాపుర, సెప్టెంబరు 19:** చిక్కబళ్ళాపుర నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్ తీరుపై దళిత సంఘాలు నిరసన చేపట్టారు. నగరంలోని ఎంజీ రోడ్డులోని జైభీమ్ హాస్టల్ ఎదుట దళితసంఘాల ఐక్యవేదిక కార్యకర్తలు గురువారం నిరసన నిర్వహించారు. ఎమ్మెల్యే దళిత వ్యతిరేక వైఖరి అవలంబిస్తున్నారంటూ మండిపడ్డారు. ఎమ్మెల్యేగా గెలుపొంది ఏడాదిన్నర కావస్తున్నా ఎలాంటి అభివృద్ధి పనులు చేయడం లేదని దళిత సంఘాల నేతలు ఆరోపించారు. పెద్దసంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైలు స్టాపింగ్ తొలగింపు

**గుంతకల్లు, సెప్టెంబరు 19:** బెంగళూరు-ధర్మవరం మధ్య నడుస్తున్న డెము రైలు (నెం. 06595/96) బెంగళూరు కంటోన్మెంటు స్టేషన్‌లో స్టాపింగ్‌ను తొలగించినట్లు రైల్వే అధికారులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ రైలును సెప్టెంబరు 20వ తేదీ నుంచి డిసెంబరు 20వ తేదీ వరకు 92 రోజులపాటు బెంగళూరు కంటోన్మెంటు స్టేషన్‌లో నిలపకుండా పంపనున్నట్లు తెలియజేశారు.

## ఇద్దరు సైబర్ నేరగాళ్ల అరెస్టు

**గుత్తి, సెప్టెంబరు 19:** సైబర్ నేరాలకు పాల్పడుతున్న ఇద్దరు యువకులను రైల్వే పోలీసులు గురువారం పట్టుకున్నారు. ధర్మవరానికి చెందిన ఖాదర్ బాషా బీ టెక్ చదివాడు. మరో యువకుడితో సైబర్ నేరాలకు పాల్పడుతూ జల్సాల కు అలవాటు పడ్డారు. సెల్‌ఫోన్ లోకేషన్ ఆధారంగా రైల్వే పోలీసులు స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద వారిని పట్టుకుని అనంతపురానికి తరలించినట్లు సమాచారం.

## సంస్కృతి, సంప్రదాయాలకు నిలయాలు మందిరాలు

● బాలకృష్ణానంద మహాసంస్థానాధిపతి గోవిందానంద సరస్వతి స్వామి

**అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 19 :** భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలకు మందిరాలు నిలయాలు అని కర్ణాటక రాష్ట్రం తలకాడులోని బాలకృష్ణానంద మహాసంస్థానాధిపతి గోవిందానంద సరస్వతి స్వామి అభిప్రాయపడ్డారు. గురువారం అనంతపురం విచ్చేసిన ఆయన నగరంలోని మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వర ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా స్వామీజీ కాశీవిశ్వేశ్వరస్వామితోపాటు శారదామాత, రాములవారి ఆలయాల్లో పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులనుద్దేశించి అనుగ్రభాషణం చేస్తూ.. కంటికి కనిపించేవాటినే నమ్ముతూ, కంటికి కనిపించని దైవత్వాన్ని నమ్మనివారు మూర్ఖులని పేర్కొన్నారు. దుఃఖమనే సముద్రంలో కొట్టుకుపోతున్న జీవులను కాపాడేందుకు భగవంతుడు వేదం అనే నావను సృష్టించారన్నారు. మనలోని శ్రద్ధ, భక్తిప్రపత్తులకు మూలకేంద్రాలు ఆలయాలు అని, మనతోపాటు మన తోటివారందరినీ కలుపుకుని కులమతాలు, రాజకీయాలకు అతీతంగా దేవాలయ వ్యవస్థను రక్షించుకునేందుకు ప్రతిఒక్కరూ పాటుపడాలన్నారు. కార్యక్రమంలో ఈఓ సాకే రమేష్ బాబు, అనువంశీకుడు హోసూరు రామసుబ్రహ్మణ్యం, ప్రధానార్చకుడు నరసింహశాస్త్రి, హర్ష, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

## కియ సంస్థ భారీ వితరణ

సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి రూ.5 కోట్లు విలువ చేసే వైద్య పరికరాల అందజేత

**అనంతపురం టౌన్, సెప్టెంబరు 19:** సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి కియాపరిశ్రమ సంస్థ యాజమాన్యం రూ. 5 కోట్లు విలువ చేసే వైద్యపరికరాలు అందజేశారు. రూ. 2.50 కోట్లు విలువ చేసే ఐవీయూఎస్, ఎఫ్ఎఫ్ఆర్ యంత్రంతోపాటు రూ. 2.50కోట్లు విలువచేసే స్టంట్స్, కాథిలాక్స్, అనుబంధ వైద్యచికిత్స పరికరాలు వితరణ చేశారు. గురువారం వైద్యశాఖామంత్రి సత్యకుమార్, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటప్రసాద్ సమక్షంలో కియాపరిశ్రమ ప్రతినిధులు అందజేశారు. ఈ సందర్భంగా కియ సంస్థ ప్రతినిధులను మంత్రి, ఎమ్మెల్యే, వైద్యాధికారులు సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ఇటీవల కాలంలో గుండె సమస్యలు అధికమయ్యాయని, ఇందుకోసం ప్రతి సీహెచ్‌సీలో 45వేల ఇంజెక్షన్‌లు అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. క్యాన్సర్ నివారణ, చికిత్స కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. కియ సంస్థ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని భారీస్థాయిలో వైద్యపరికరాలు ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. ఇదేస్ఫూర్తిని ఇతర కార్పొరేట్ సంస్థలు కొనసాగించి విరాళాలు ఇవ్వడానికి ముందుకురావాలని అలాంటి వారికి ప్రభుత్వ సహకారం ఉంటుందన్నారు. అవసరమైన వసతులు, సౌకర్యాలు కల్పిస్తున్నామని, డాక్టర్లు మరింత బాధ్యతగా పనిచేయాలని సత్యకుమార్, ఎమ్మెల్యే దగ్గుపాటి సూచించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాలరావు, డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి, సూపర్ స్పెషాలిటీ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, కార్డియాలజీ వైద్యులు డాక్టర్ సుభాష్‌చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు



వైద్య పరికరాలను పరిశీలిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే

# రావత్ సెంచరీ

● సెంచరీకి చేరువలో సంజు శ్యాంసన్

● అనంతలో దులీప్ ట్రోఫీ పోటీలు

**అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 19:** దులీప్ ట్రోఫీలో భాగంగా అనంతపూర్ క్రికెట్ గ్రౌండ్ ఏ స్టేడియంలో గురువారం ఇండియా-ఎ, సి జట్ల మధ్య ఆట ప్రారంభమైంది. తొలిరోజు ఎ-జట్టు ఆటగాడు శషావత్ రావత్ సెంచరీ సాధించారు. టాస్‌గెలిచిన ఇండియా సి జట్టు బౌలింగ్ ఎంచుకుంది. మొదట బ్యాటింగ్ చేపట్టిన ఇండియా-ఎ జట్టులో ఓపెనర్లు ప్రథమ్‌సింగ్ (6), మయాంక్ అగర్వాల్ (6), తిలక్‌వర్మ(5), రియాన్ పరాగ్ (2), కుమార్ కుషర్గ (0) విఫలమయ్యారు. ఆ తరువాత షాంశ్ ములనీ 44, తనుష్ కొటియాన్ 10 పరుగులు చేశారు. శాషావత్ రావత్ 235 బంతుల్లో 15 బౌండరీలతో 122 పరుగులు, ఆవేష్‌ఖాన్ 16 పరుగులతో క్రీజ్‌లో ఉన్నారు. మొదటి రోజు ఆట ముగిసే సమయానికి ఇండియా-ఎ జట్టు 77 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 224 పరుగులు సాధించింది. ఇండియా-సి బౌలర్లలో అన్షుల్ కాంబోజ్ 3 వికెట్లు, వైశాక్ విజయ్‌కుమార్ 2, గౌరవ్‌యాదవ్ ఒక వికెట్ తీసుకున్నారు.

### సెంచరీకి చేరువలో సంజు

అనంతపూర్ క్రికెట్ గ్రౌండ్ బీలో ఇండియా-బి, డి జట్ల మధ్య పోటీ సాగింది. ఈ మ్యాచ్‌లో సంజు శ్యాంసన్ సెంచరీకి చేరువయ్యారు. బి జట్టు టాస్‌గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. మొదట బ్యాటింగ్ చేసి ఇండియా-డి జట్టులో ఓపెనర్లు దేవదత్తు పడిక్కిల్ 50 పరుగులు, కేఎస్ భరత్ 52 పరుగులతో 105 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. అనంతరం వచ్చిన రికీభుయ్ 56 పరుగులు, నిషాంత్ సింధు 19 పరుగులు చేశారు. శ్రేయాస్ అయ్యర్ మరోసారి డకౌట్ అయ్యారు. సంజు శ్యాంసన్ 89 పరుగులు, శరాన్ష్‌జైన్ 22 పరుగులతో క్రీజులో ఉన్నారు. మొదటి రోజు ఆట ముగిసే సమయానికి ఇండియా-డి జట్టు 77 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 302 పరుగులు చేసింది. ఇండియా-బి బౌలర్లు రాహుల్ చాహర్ 3 వికెట్లు, నవదీప్ సైనీ, ముకేష్‌కుమార్ చెరో వికెట్ తీశారు.

